### డిజిట్-మెరిట్

# 90,000

కోట్ల రూపాయలు



ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు. రాష్ట్రంలోని 27.60 లక్షల పంపు సెట్లకు ఏటా రూ.10,500 కోట్ల వ్యయం.


### థర్డ్ అంపైర్



మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను పునరుద్ధరించడం గొప్ప కార్యక్రమం. రాజకీయాలకు అతీతంగా మిగతా రాష్ట్రాలు కూడా కేసీఆర్ పథకాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి.

▪ ఇందిరా ఖురానా,
హిమాలయన్ రివర్ బేసిన్ కౌన్సిల్ చైర్‌పర్సన్

### థౌజండ్ వాలా..




కౌంట్ డౌన్ 31

హైదరాబాద్ | సోమవారం 30 అక్టోబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com


I



## పరిశ్రమలకు దన్ను

తొమ్మిదేండ్లలో అనేక దిగ్గజ బహుళజాతి సంస్థలు తెలంగాణలో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. బీఆర్‌ఎస్ అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణకు రూ.3.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.సుమారు 22.50 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభించాయి. టీఎస్ ఐ పాస్, 24 గంటల విద్యుత్తు, మెరుగైన శాంతి భద్రతలు, సుస్థిర ప్రభుత్వం, సమర్థ పాలన వల్లే ఇది సాధ్యమైంది.

▪ కేసీఆర్




# బ్రాండ్ హైదరాబాద్..

## గ్రాండ్ తెలంగాణ

- గతంలో ఇన్వర్టర్లు.. జనరేటర్లు..
- హైదరాబాద్‌ను ప్రాజెక్ట్ చేయని ఉమ్మడి పాలకులు
- రాష్ట్ర ఏర్పాటుతో మారిన చిత్రం..
- ఇప్పుడు హైదరాబాద్ వరల్డ్ ఫేవరెట్
- టీఎస్ ఐ-పాస్ చట్టంతో పారిశ్రామిక విప్లవం..
- ఐటీఐఆర్ వస్తే మరింత దూకుడు

**'తెలంగాణ వచ్చాక నిరంతర విద్యుత్తు, ప్రభుత్వ పాలసీ వెరసి హైదరాబాద్ బ్రాండ్ వాల్యూ ఆకాశమంత పెరిగింది. ముఖ్యమంత్రి దూరదృష్టితో పారిశ్రామికరంగానికి తెలంగాణ సుస్థిరమైన గమ్యస్థానంగా ఎదిగింది' అంటున్నారు కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్(సీఐఐ)-తెలంగాణ చైర్మన్, కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) మాజీ జాతీయ అధ్యక్షులు సి.శేఖర్‌రెడ్డి. దశాబ్ది తెలంగాణలో జరిగిన విప్లవాత్మక మార్పులపై 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా సంభాషించారు.**

**తెలంగాణలో పారిశ్రామికరంగ పురోగతి ఎలా ఉన్నది?**


గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ పారిశ్రామికరంగ పురోగతి ఊహించిన దానికన్నా గొప్పగా ఉన్నది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయి. మరెన్నో సంస్థలు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ స్నేహపూర్వక విధానాలు, భూముల ధరలు అందుబాటులో ఉండటం, జీవన వ్యయం తక్కువగా ఉండటం, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులు బాగున్నాయి. నైపుణ్యం గల సిబ్బందికి ఇక్కడ కొదువ లేదు. ఎయిర్ కనెక్టివిటీ, రోడ్ కనెక్టివిటీ మెరుగ్గా ఉన్నది. ఇవన్నీ తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని పెట్టుబడులకు గమ్యంగా మార్చాయి. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ విశ్వవ్యాప్తమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌ను ఆకర్షణీయమైన గమ్యంగా చూస్తున్నారు. అభివృద్ధిలో ఎవరూ ఆపలేని స్థాయికి నగరం చేరుకున్నది. ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టుతో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గింది. మిషన్ కాకతీయ పథకంతో చెరువుల్లో నీరు నిండి భూగర్భజలాలు పెరిగాయి. వ్యవసాయ రంగం గణనీయంగా వృద్ధి చెందుతున్నది.

**రాష్ట్రం ఏర్పడక ముందు పరిస్థితులపై మీ విశ్లేషణ?**

రాష్ట్ర ఏర్పాటుకు ముందు విద్యుత్ సమస్యను ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోతలతో చిన్నా పెద్దా పరిశ్రమలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ప్రతి పరిశ్రమలో జనరేటర్లు, ఇన్వర్టర్లు సర్వసాధారణంగా ఉండేవి. అంతేకాదు, కోతల కరెంట్‌తో పరిశ్రమలు నడవక కార్మికులు ఉపాధి కోల్పోయేవారు. పారిశ్రామికవేత్తల వ్యాపారాలూ దెబ్బతినేవి. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన కొత్త పారిశ్రామికవాడలు అందుబాటులో లేకపోవడం, హైదరాబాద్ బ్రాండ్‌ను సరిగ్గా ప్రాజెక్ట్ చేయకపోవడం వల్ల అంతగా పెట్టుబడులు రాలేదని చెప్పవచ్చు. ట్రాఫిక్ సమస్య కూడా చాలా ఉండేది.

**తెలంగాణ ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ప్రోత్సాహకాలు ఎలా ఉన్నాయి? రాష్ట్రం ఏర్పడకముందు ఎలా ఉండేది?**

రాష్ట్రంలో పారిశ్రామికరంగం వేగంగా పురోగమించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపడమే కారణం. వివిధ పథకాల ద్వారా అందే ప్రోత్సాహకాలే కాకుండా పరిశ్రమలు, వాటి వల్ల ఏర్పడే ఉపాధి అవకాశాల ఆధారంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నది. టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్ ద్వారా కొత్త స్టార్టప్స్‌ను ప్రోత్సహిస్తున్నది. నైపుణ్యంగల సిబ్బందిని తయారుచేస్తున్నది. ఒక పరిశ్రమ రావడంవల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు దానిచుట్టూ భూముల ధరలు పెరుగుతాయి. ప్రోత్సాహకాలు ఒకప్పుడు ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ సహకారం, ఆకర్షణీయ విధానాలు, మౌలిక సదుపాయాల వృద్ధి, టీఎస్ ఐ-పాస్ వంటి చట్టం తీసుకురావడం వల్ల ఇప్పుడు పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి.



సి.శేఖర్‌రెడ్డి



తెలంగాణ రాష్ట్రానికి ఐటీఐఆర్ మంజూరు చేస్తే ఎంతో బావుంటుంది. ఐటీలో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందింది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ తదితర ఇతర నగరాలకు కూడా విస్తరిస్తున్నది. వరంగల్‌లో దాదాపు పది పెద్ద ఐటీ కంపెనీలు ఉండగా, వాటిలో దాదాపు ఆరువేలకుపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఐటీఐఆర్ మంజూరుచేస్తే ఐటీలో తెలంగాణకు తిరుగు ఉండదు.

టీఎస్ ఐ-పాస్ చట్టం తెలంగాణ పారిశ్రామికరంగంలో ఓ విప్లవాత్మకమైన ముందడుగని చెప్పవచ్చు. సింగిల్ విండో ద్వారా శీఘ్రగతిన అనుమతులు ఇవ్వడం వల్ల పెట్టుబడిదారుల వ్యయప్రయాసలు తగ్గాయి. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, అనుమతులకు సంబంధించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్ధతి అమలవుతున్నది. వాటితో పోలిస్తే టీఎస్ ఐ-పాస్ ఎంతో మెరుగైందనడంలో సందేహం లేదు.


**ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణలో అమలవుతున్న పారిశ్రామిక విధానంపై మీ అభిప్రాయం..**

భౌగోళికంగా, వాతావరణ పరంగా హైదరాబాద్‌కు కలిసొచ్చే అంశాలు ఎన్నో ఉన్నాయి. మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. అన్నిటినీ మించి శాంతిభద్రతలు బాగున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం, రోడ్డు సౌకర్యం, ఔటర్ రింగురోడ్డు, మెట్రోరైలు, అంతర్జాతీయస్థాయి హోటళ్లు, మాల్స్ ఇవన్నీ హైదరాబాద్‌ను అత్యున్నత స్థాయిలో నిలబెట్టాయి. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో ఒక్క అవాంఛనీయ ఘటన జరగలేదు. బహుశా మరే రాష్ట్రానికీ ఇన్ని అనుకూలతలు ఉండకపోవచ్చు. దీంతో ఒక్కసారి తెలంగాణకు వచ్చినవారు ఇక్కడే స్థిరపడిపోతున్నారు. తమ పెట్టుబడులను ఇక్కడే విస్తరిస్తున్నారు.

**పారిశ్రామికంగా రాష్ట్రంలో ఏఏ రంగాలకు ఎక్కువ అవకాశాలున్నాయి? వాటికి గల కారణాలు?**

నీటిపారుదల మెరుగవ్వడంతో సాగు పెరిగింది. దీంతో ఆహార ఉత్పత్తులకు అవకాశాలు పెరిగాయని చెప్పవచ్చు. అలాగే, ప్రధానంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తున్నాయి. ఐటీ ఎగుమతులు గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరిగాయి. ఫార్మాలో అయితే హైదరాబాద్ ఔషధ రాజధానిగా ఎదిగింది. అనేక వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయి. వీటికితోడు టెక్స్‌టైల్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలు కూడా బాగానే వృద్ధి చెందుతున్నాయి. ఐటీ రంగం వెస్ట్ హైదరాబాద్ కేంద్రంగా విలసిల్లుతున్నది. ఇప్పుడు ఆదిభట్ల, ఘట్‌కేసర్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లోనూ ఐటీ కంపెనీలు వస్తున్నాయి. ప్రభుత్వం ద్వితీయశ్రేణి నగరాలకు కూడా ఐటీ రంగాన్ని విస్తరించింది. ఐటీఐఆర్, నిమ్జ్ అందుబాటులోకి వస్తే ఇండస్ట్రీలు మరింత వేగాన్ని పుంజుకుంటాయి.

...✍ ఎస్. కిషోర్



### ఎటమటం!




## పదేండ్లదాకా రానట్టేనా?

**కాంగ్రెస్** అభ్యర్థుల సంఖ్య కంటే ఆ పార్టీ సీఎం అభ్యర్థుల సంఖ్య రోజు రోజుకూ పెరిగి పోతున్నది. ఎన్నికలలో పోటీ చేస్తున్న వారే కాకుండా రాజకీయాలను వదిలేసిన నాయకులు కూడా సీఎం పోస్టుపై కన్నేశారు. సీఎం రేసులో తాను కూడా ఉన్నట్టు తాజాగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన గతంలో చాలాసార్లు చెప్పారు. కానీ మరో పదేండ్లకైనా అయి తీరుతానని ప్రస్తుతానికి మాత్రం వాయిదా వేసుకున్నారు. అంటే?...మరో పదేండ్ల దాకా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని పరోక్షంగా చెప్పడమే కదా?! కాగా కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరూ తమకు తాము సీఎం అభ్యర్థిగానే భావిస్తున్నారు. వీరిలో ఎవరూ మంత్రుల ఊసే ఎత్తడం లేదు. ఇంతకు వారి సర్కార్‌లో మంత్రుల పోస్టులు ఉంటాయా? లేక వారానికో, నెలకో ఒక్కరి చొప్పున సీఎం పదవిని పంచుకుంటారా? అన్నది అర్థం కాని విషయం. అయినా, ఒకే పార్టీలో ఇంత మంది సీఎం క్యాండేట్లా? ఈ పరిస్థితి మరే పార్టీలో ఉండదు. కారణం ఏమై ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడిని అడిగితే, తమని ప్రజలు ముందు ఎమ్మెల్యేగా గెలిపిస్తారో లేదోనన్నది ఆ అభ్యర్థుల భయం. తాను సీఎం క్యాండేట్‌నని చెబితే కనీసం నాలుగు ఓట్లన్నా పడుతాయన్నది వారి ఆశ... అని సెలవిచ్చారు.

### ఖుల్లం ఖుల్లా

గ్యారెంటీలకు మీరు గ్రహణం పట్టిస్తున్నారు
లేటెస్టుగ మళ్లీ వాగ్దానాలు గుప్పిస్తున్నారు
ప్రజలేమీ వెర్రిబాగులోళ్ళు కారు
మీ నాడిని చూశారిక మిమ్ము నమ్మబోరు

పట్టుమని మూడు గంటలు విద్యుత్తు ఇవ్వనోళ్లు
నరం లేని నాలుకతో వాగుతున్న నోళ్లు
ఎవరికి తెలియదులే మీరాడే బాగోతం
నమ్మితే నిలువున నట్టేట ముంచే మీ వైనం

...✍ దండమూడి శ్రీచరణ్

ఫ టా ఫ ట్

Interview

## కన్ఫ్యూజన్ కాంగ్రెస్.. బాతాఖానీ బీజేపీ

**నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచే ఊపులో ఉన్నట్టున్నారు? ప్రచారం ఎలా సాగుతున్నది?**

ఆల్రెడీ గెలిచిన ఊపులో ఉన్నట్టనిపిస్తున్నది. రెండు దశల ప్రచారం పూర్తి చేశినం. ఇకపై చేయబోయే ప్రచారమంతా అడిషనలే.

**ఇబ్రహీంపట్నంలో పోటీ ఎలా ఉండబోతున్నది?**

గత మూడు ఎన్నికల నుంచి మీరు చూస్తనే ఉన్నరు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాలుగోసారి కూడా గెలుస్తరని ప్రజలే చెప్తున్నరు. ఒక్కమాట క్లియర్‌గా చెప్తున్న. కాంగ్రెస్ అంటే కన్ఫ్యూజ్ చేసే పార్టీ. భాజాపా అంటే బాతాఖానీ తప్ప ఆందానీ చూపియ్యని పార్టీ. ఆ రెండు పార్టీలను జనాలు నమ్మడం లేదు. ఇగ పోటీ ఎక్కడిది?

**అంటే మీ ప్రత్యర్థులు మీకు పోటీ కాదనుకుంటున్నారా?**

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని రకరకాల గుర్తులు పెట్టుకొని వచ్చినా.. ఇప్పటికి మూడుసార్లు ఓడగొట్టి ఇంటికి పంపిన. ఇగ బీజేపీ అంటరా..? ఇబ్రహీంపట్నం చైతన్యం ఉన్న గడ్డ. ఇక్కడ బ్రహ్మాండమైన ఉద్యమాలు జరిగినయ్. బీజేపీకి ఇక్కడ అంత సీన్ లేదు.

**కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వర్సెస్ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై మీ అభిప్రాయం ?**

ఆరు గ్యారంటీలు కాదు కదా.. అందులో ఒక్క గ్యారంటీ కూడా అమలు చేసే దమ్ము కాంగ్రెస్ పార్టీకి గానీ, ఆ నాయకులకు గానీ లేదు. అందుకు నాది గ్యారంటీ.

**ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి?**

ముచ్చటగ మూడోసారి కేసీఆర్ సార్ అధికారంలోకి వస్తరు. నేను 30వేల మెజారిటీతో గెలుస్తా.

**ఇబ్రహీంపట్నం అభివృద్ధి గురించి మీరేం చెప్తరు?**

పదేండ్ల కింద ఇబ్రహీంపట్నం.. ప్రస్తుత ఇబ్రహీంపట్నం తేడా చూస్తే మీకే అర్థమవుతుంది. విశాలమైన నాలుగు లైన్ల రోడ్లు, కరెంటు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నిర్మాణంలో ఉన్న 100 పడకల దవాఖాన, అన్నీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం, స్ట్రీట్ లైట్లు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నయ్. గడిచిన ఏడేండ్లలో ఇబ్రహీంపట్నంకి 3వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశినం.

**నియోజకవర్గ ప్రజలకు మీ అప్పీల్ ఏంటి?**

తెలంగాణకు ఏం కావాల్నో కేసీఆర్‌కు తెలుసు. ఇబ్రహీంపట్నంకు ఏం కావాల్నో మంచిరెడ్డికి తెలుసు. ఈ విషయం మా ఓటర్లకు బాగా తెలుసు. ఇగ నిర్ణయం వాళ్లదే.

▪ సుంకరి



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి